# సత్తుగిన్నె స్టోరీ

వజ్జీగ పోసుకోటానికి పాలు తోడెట్టుకోటానికి మా ఇంట్లో తాత ముత్తాతల నాటి సత్తుగిన్నె ఒకటుండేది. ఆసత్తుగిన్నెని ఏవంతా తోమి తళతళలాడేట్టు మెరిసిపోయేలా వుంచేవాళ్ళం. అప్పటికి జర్మన్ సిల్వరు పళ్ళేలూ, కంచాలూ, సిబ్బెలూ, గిన్నెలూ వచ్చినా వాటిని మా ఇంట్లోకి రానిచ్చేవారు కారు మా అత్తగారు. కంచు, ఇత్తడి సామాన్లె వాడేవాళ్ళం కాని మాయవెండి అన్నా, పింగాణీ సరుకన్నా మా వాళ్ళకి డోకు. వెండి కంచాలు, వెండిగ్లాసులు, వెండి మరచెంబులూ, తమలపాకుల పళ్ళెలు గంధపు గిన్నెలు పన్నీరు బుడ్లూ, వూదొత్తుల స్టాండ్లూ, కుంకుమ భరిణలూ, యిలా చాలా మిస్లీనియస్ సరుకు వెండివే మాకూ వున్నాయను కోండి వాటిని పేట్లలోనూ బీరువాల్లోనూ దాచుకునే వాళ్ళం. అప్పుడప్పుడు బిద్దకించినప్పుడు రాత్రిళ్ళు మా వెండి సామాన్లు తొల్చి శుభ్రంచేశాక మాసిన బట్టల బుట్టల్లోనూ బియ్యపు డబ్బాలోనూ పెట్టి పైన విడిచిన బట్టలూ, కూరల బుట్ట చేటా వగైరాలను కప్పి శుభ్రంగా నిద్దర్లుపోయే వాళ్ళం. కంచెంబులూ పంచపాత్రలు రాగి హరివాణాలు ఉద్దరిణలు ఇత్తడి చెంబులు, గ్లాసులు, గట్రా ఉండేవనుకోండి అవన్నీ తళతళా మెరిసి పోయేలా తుడిచి సర్దుకుని మా వంటిల్లు కలియుగ వైకుంఠంలా తీర్చి దిద్దుకునేవాళ్ళం కడిగిందే కడగటం తుడిచిందే తుడవటం అస్తమానం

బాల్చీ చీపురు కట్టా అలుకుగుడ్డా చింతపండు కుంకుడుకాయ పిప్పితో, సున్నిపిండితో కొబ్బరి పీచుతో మా రోజులు వెళ్ళిపోతుండేవి.

అప్పటికి కుంపట్లు వచ్చాయి కాని పొయ్యిలు ఇంకా మూలపడ లేదు. కాఫీలు గూఫీలు, పప్పులు పాలుకాచటం, చంటిపిల్లలకు వేడ్నీళ్ళు కాచటానికి బొగ్గుల కుంపటి వాడేవాళ్ళం కాని మా పెద్దవాళ్లు బొగ్గుల ఖర్చు తగ్గించండర్రా అని విసుక్కుంటూ వుండేవారు. గిన్నెలు గ్లాసులు వగైరా పని మనుషులుతొలిచినా మళ్లీ కడుక్కుని తుడుచుకోందే వాటిని ఉపయోగించటానికి వీలుండేది కాదు. ఆ త్రోమిన అంట్లలో ఖర్మకాలి ఒక మెతుకో ఒక కూరముక్కో ఒక పొపుగింజో ఏ గిన్నె అంచుల క్రింద వున్నా మొత్తం అన్నింటినీ మళ్ళీ త్రోమి మళ్ళీ తుడుచుకో వలసిందే.

ఇప్పుడు లైఫ్ చాలా మారిందనుకోండి. అప్పుడు పనివాళ్లు తోడినవీళ్లు మాకు పనికి వచ్చేవికావు. అందుకని చచ్చినట్లు చేతులు పడి పోయేలా ఆడవాళ్ళందరూ నీళ్ళు తోడాలిసిందే. పైగా ఇవన్నీ చేరెయ్యటం మరీకష్టంగా వుండేది మేడమీద వుంటే ఇహ ఆ కొంపలోని ఆడాళ్ల ప్రాణాలు పోయేవి. పంపులు వచ్చినా యీ యిక్కట్లు తప్పలేదు. ఇలా అయోమయంగా జీవించటం తప్ప సుఖపడ్డం మా వాళ్లకు ఏ సూత్రం తెలిసేదికాదు. హైరాణ పడిపోవటం కాళ్లు విరగొట్టుకోవటం. ఆ పైన వుండుండి మంచాని కడ్డంగా పడిపోవటం తప్ప ఆడాళ్ళకు మరేమీ తెలిసేదికాదు. విపరీతమైన స్నానాలు, తడిబట్టలతో వంటలు, చాకిరీ.... యిలాటి క్రూరమైన గృహజీవితం గృహిణి అనుభవించి తీరాల్సిందే.

ఇవి యిలా వుండగా పుపోషాలు, వ్రతాలు, భజనలూ, బ్రాహ్మలకి భోజనాలు పెట్టి అవుపోసన వడ్డించుకోవటాలూ, తద్దినాలు వగైరా వగైరా లొచ్చి మూలిగే నక్కమీద తాటిపండులా పడిపోతూండేవి. ఏ కొత్త కోడలైనా నాల్రోజులు అపురూపంగా కాలు క్రింద పెట్టకుండా జరిపించు కుంటే జరిగేది. తరువాత మామూలే—అలుగుడ్డా చీపురూ బాల్చీ తళ్ళూ

మళ్ళా స్నానాలూ పూజలు- అదో అయోమయ ప్రపంచం—ఇహ చచ్చే దాకా ఆవిడకు పాపం అందులోంచి బయటపడి తొంగిచూడ్డానికి వీలుండేది కాదు. పాడి వ్యవసాయం వున్న కొంపల్లో సగేసరి—యసువాకిరీ వుండేది. ఓ కాలవకిగాని వూళ్ళో చెరువుకిగాని నూతికిగాని వెళ్ళి బట్టలుతుక్కుని స్నానంచేసి మంచినీళ్ళు తెచ్చుకునేప్పుడు కాస్త వూపిరి పీల్చుకున్నట్లుండేది అమ్మ లక్కలతో బాతఖానీ-మళ్ళీ సంసారంలో పడిపోవటమేకాని అందు లోంచి తేలటమంటూ వుండేదికాదు. పురుళ్లూ పుణ్యాలూ, నోములూ,



వ్రతాలూ, సమర్త బంతులూ, పెళ్ళిళ్లూ, శోభనాలు యిలాటి కార్య కలపాలు వచ్చినపుడు ఆడాళ్లకు ఆటవిడుపులా గుండేది. ఖర్చేననుకోండి. చీరెల్నా నగల్నా పిల్లల్నా చూపించుకుని సంతోషపడేవారు. పల్లెటూళ్ల నుంచి పట్నాలకు తరలివెళ్లినా యిలాగే యీ పద్ధతులూ ఆచారలే సాగించుకునే వారు. ఆదాయాలు తగ్గినా ఖర్చులు పెరిగినా అలవాట్లు పాతవే- అందుకోసం అప్పులుచేసి పరువు కోసం ఆడంబరాల్ని అంటిపెట్టుకుని బ్రతికారు. ఇవన్నీ నవల్లోనూ చెప్పరులెండి (తెలీక) మాట వరసొచ్చింది గనుక గ్యాస్ అనుకున్నా జ్ఞాపకం చేసుకుని అప్రస్తుతమైనా అంతా ఏకరవు పెట్టాను.

సత్తుగిన్నె స్టోరీ అలా వుండిపోయింది. అదంటే మా అత్తగారికి ప్రాణం. దాని వయసు ఆవిడ వయసు కంటే ఎక్కువ-అందుకని పెద్ద

దీక్ష్యాన్నా చూసినంత మర్యాదగా ఆ సత్తుగిన్నెను ఆవిడ చూసుకునేది. కాని ఆవిడ దాన్ని మోడర్నైజ్ చేయాలనే ఊహా వచ్చింది. అంతే ఉరిపొంటి కొత్తగిన్నె చేయించాలని- మన దేశంలో ఎవర్నీ నమ్మబుద్ధి కాలేదు. నమ్మి ఎవరి చేతిలోనైనా పడితే సత్తుగిన్నెని కాస్తా మాయం చేస్తే- అనే దిగులొకటి ఆవిడకు లోపల వుండేది.

ఇంతలో మా ఇంట్లోకి దక్షిణాది అలవాట్లు కల తెలుగు కుటుంబమే ఒకరొచ్చి అద్దెకు దిగారు. ఆవిడ వీణ వాయిస్తుంది. చిన్నవయసే అయినా ఆవిడకన్నీ ముసలమ్మ అలవాట్లే-ఎప్పుడూ తడిగుడ్డతో స్నానాలూ పూజలు, యిలా పడుచు వయసులో వుండీ ముదిరిపోయిన బెండకాయలా బెండమ్మలాగా పెద్ద పెద్ద కబుర్లు మాట్లాడేసేది. ఆవిడకు సత్తుగిన్నెను చూపించిందో రోజున- దాన్ని చూశాక మా అత్తగారు నిలవలేక పోయారు. ఆ సత్తుగిన్నె ముందు మా ఇంట్లో అంచులరిగిపోయిన బోడి గిన్నె జమున ముందు పండరీబాయిగానో, జయలలిత ముందు జి. వరలక్ష్మిలానో మా అత్తగారికి అగుపడి వుంటాలి. మా పక్కింటి బెండమ్మ గారు మద్రాసు వెళ్తుంటే మా అత్తగారు ప్రతిమాలి పదిరూపాయలిచ్చి మా సత్తు గిన్నెను ఆవిడకు మరీ మరీ చెప్పి కొత్తగిన్నె పోతపోయించి తెచ్చిపెట్టమని యిచ్చారు.

ఇది జరిగాక ఆవిడ దక్షిణాది యాత్రలన్నీ పూర్తిచేసుకుని వచ్చింది. కాని మా సత్తుగిన్నె ఆవిడతో రాలేదు, మా అత్తగారు లోపల లోపల చిరాకుపడినా ఓపిక పట్టి వస్తుందోస్తుందని నిరీక్షించ సాగారు. ఆర్నెల్లు తర్వాత బెండమ్మగారి ఆడబడుచు చెల్లెలు వచ్చింది. ఆవిడతో వచ్చిన సత్తుగిన్నెను చూసి మా అత్తగారినోట మాటరాక నిలువుగుడ్లేసుకుని నిలబడి పోయారు. ఆ గిన్నెకు పూర్వపు కళలేదు-తెల్లగా మెరిసి పోవలసిన సత్తుగిన్నె కొన్ని కోట్ల సంవత్సరాల తర్వాత భూగర్భశాస్త్ర పరిశోధకులు వెలికితీసిన పురాతత్వ పరిశోధనల్లో బయటపడ్డ వస్తువులా వుంది. కాని, అందులో మజ్జిగపోస్తే కాలకూట విషం తయారవుతుందేమో అనే మా కందరికీ అనిపించిమాట వాస్తవం, మా అత్తగారు ఏదో అనే

బోతే మీసత్తు పాతసత్తు కరగేస్తే వున్న మతీపోయినట్లు నల్లగా తయారయింది అందట బెండమ్మగారు. మా అత్తగారికి కళ్లనీళ్లు పర్యంతమయింది. వూరుకోండత్తయ్యా అని మేము ఓదార్చినకొద్దీ ఆవిడ చిరాకు ఎక్కువయింది. ఆ నల్లగా వున్న సత్తుగిన్నెను మా అత్తగారు ఆటకమీద పారేయించారు. దాన్ని చూస్తూన్నకొద్దీ ఆవిడకు కడుపులో దీవేసినట్లుగా వుందట.

బెండమ్మగారు మా అత్తగారు మళ్లీ మాట్లాడుకోలేదు. ఇది మా సత్తుగిన్నె స్టోరీ - మేవిప్పుడు అన్నిటికీ స్టీలు గిన్నెలే వాడుతున్నా మనుకోండి. పోతపోసినందుకు మజూరీ మరో రెండు రూపాయలయిందని బెండమ్మగారు నొక్కి చెప్పినా మా అత్తగారు వినిపించుకోలేదు. ఆ రెండు రూపాయలబాకి అలా వుండిపోయింది. నేనిస్తానంటే మా అత్తగారు చంపేస్తారు. ఈ స్టోరీ అంతా మా వారికి చెబితే "డామిట్ నోరుసుయ్" అన్నారు బెండమ్మగారి సత్తుగిన్నెను చూసినపుడల్లా మా అత్తగారు అవాక్కయి నిలబడిపోతారు. ఆడవాళ్లు మరీ అంత సెంటిమెంటలయి సత్తప్పాలాలను కూడా హ్యూమనైజ్ చేసి పారేస్తే యీ ప్రపంచం చాలా దుఃఖమయ మయిపోతుంది. ఏం చేస్తాం?